# అనగనగా... ఒక కథ

## పతనం

ఆ బేచ్‌లర్ రూంలో ఒక్కొక్కళ్లు ఒక్కో ఐటమ్ చొప్పున డిన్నర్ తయారీలో ఉన్నారు.

నిరంతరం వార్తాఛానెల్‌లో.. పద్దెమ్దోసారి ప్రొద్దున్న చూపించిన పాచివార్తలు ప్రసారమవుతున్నాయి.

ముసుగు వేసుకున్న ఓ అర్భకప్రాణి చుట్టూరా నలుగురు జమాజెట్టీల్లాంటి మీసాల పోలీసులు- టీవీవాళ్లు కవర్ చేస్తారనేమో షోగ్గా నిలబడి వికటాట్టహాసాల్ని విజయహాసాలుగా చేసి దొంగ గురించి వివరాలు చెప్తున్నాడు పెద్దమీసాలాయన.

''ఈ వ్యక్తిని చూస్తే దొంగ అనుకోం. ఋషిలా గెడ్డం కనుబొమ్మల మధ్య ఎర్రటి బొట్టు- ఉండుండి, తెల్సున్న వాళ్ల ఇళ్లల్లోనే దొంగతనాలు చేస్తాడు. గొప్ప సంగీత కుటుంబంలో పుట్టిన ఈ వ్యక్తి ఆ కళలోనూ చోరకళలోనూ నిష్ణాతుడే. గోపాలకృష్ణ అన్న పేరు గల ఇతను అటు సంగీతానికీ ఇటు దొంగ కళకీ కూడా సార్ధక నామధేయుడు...''

''వార్తల్లో కవిత్వాలూ కామెంట్స్ ఎక్కువైపోతున్నాయి. అసలు న్యూస్‌ని న్యూస్‌గా..'' అంటూ ఏదో చెప్పబోతున్నాడు సంతోష్.

''అరె..వాగుడాపరా-వాడు మా గోపాల్‌గాడులా ఉన్నాడు'' అన్నాడు కేవమ్.

''ఎవడా మీసాల పోలీసా?''

''కాడెహే..ఆ గోపాలకృష్ణ''

''ఆ ముసుగుదొంగా?'' గొల్లున నవ్వాడు మూర్తి.

''ముసుగులో దొంగని పోల్చుకున్నావంటే నువ్వు తోడుదొంగవన్నమాట'' అన్నాడు సంతోష్.

''కొంచెంసేపు మాట్లాడకండిరా..ప్లీజ్..'' కేవమ్ కస్సుమన్నాడు.

పోలీసు మీసం చిత్రంగా పైకీ కిందకీ కదుల్తోండగా నేపథ్యం నుంచి న్యూస్రమ్మ కామెంట్రీ స్టార్టయింది.

''ఈ గోపాలకృష్ణ తల్లితండ్రులూ, చిన్నమ్మలూ, అన్నయ్యలూ...అందరూ సంగీతంలో ఉద్దండపండితులే. కోయిల పుట్టగానే పాట నేర్చినట్లు పదిహేనో సంవత్సరానికే ప్రముఖ సంగీతజ్ఞుల సరసన సహకార వాయిద్యకారుడుగా సరిపడే వైలెన్ నేర్చుకున్నాడు. గాత్రంలోనూ...స్వర రచనలోనూ కొన్ని మెట్లు కూడా సునాయాసంగా అధిరోహించాడు.

ముఖ్యంగా నాట్యకారులకి నట్టువాంగం చేయడం, గానం, సంగీత కూర్పుల్లో అనుభవాన్ని సంపాదించాడు. 30 ఏళ్లకి.. పదేహేనేళ్ల ముందే వైలెన్‌లోనూ..గాత్రంలోనూ గురువై అనేకమందికి సంగీతం నేర్పడం మొదలెట్టాడు. అలాగే.. అదే కళని ఆరాధిస్తే, అతను మంచి స్థాయి కళాకారుడయ్యేవాడు. కానీ ఆ పసి వయస్సులోనే శిష్యురాళ్లుగా వచ్చిన అమ్మాయిలతో ప్రేమకలాపాలు ప్రారంభించాడు. అతని కళని చూసి ఆరాధించిన వాళ్లలో కొందరు అతనిలో కల్మషాన్ని గమనించి సంగీత పాఠాలు మాని జీవితాన్ని కాపాడుకున్నారు. కొందరు గుట్టురట్టు కాకుండా గట్టెక్కేశారు..''

ఇలా...టీవీ ఏంకర్ నేపథ్యంలో వ్యాఖ్యానిస్తుండగా షడన్‌గా కరెంటు పోయింది.

మిగిలిన కథ కేవమ్ కంటిన్యూ చేశాడు. ''వాడు చిన్నప్పుడే గొప్పవాడయిపోవటం- అయిపోయినట్లు తెల్సిపోవటం వాడి బతుకుని నాశనం చేసింది. కష్టపడి సాధిస్తేనే ఏదైనా నిలబెట్టుకుంటాం''

''దొంగతనం చెయ్యవలసిన పనేంట్రా మీ వాడికి''

''అదేరా...నాకూ అర్థం కావట్లేదు'' కేవమ్ విచారంగా అన్నాడు.

అంతలో పవర్ వచ్చింది. టీవీ మొదలైంది. ''దానికి తోడు తాగుడు అలవాటు అవడం, ఆ అలవాటు ముదరటంతో కచేరీలకి పిలుపులు - పాఠాలూ అన్నీ హరించుకుపోయాయి. ఇంక దొంగతనమే అతనికి ఏకైక మార్గంలా కనిపించింది. వెనకటి పరిచయానికో పాటలో పాండిత్యానికో, కుటుంబం మీద ఉన్న గౌరవానికో ఈ వ్యక్తిని ఇంట్లోకి రానిచ్చి...అన్నం పెట్టిన స్నేహితుల ఇళ్లల్లోనే.. దొంగతనాలు చేసేవాడు. పూజాగదిలో వెండి దీపాలు, విగ్రహాలూ, సెల్‌పోన్లూ, చైన్లూ ఒకటేమిటి చక్కగా పాడుతూనే అదనుచూసి చల్లగా చోరకళ ప్రదర్శించాడు. ఇటీవల ఒక స్నేహితుడి ఇంట్లో దొంగిలించిన సెల్‌ఫోన్ ద్వారా ఇతను చేసిన ఫోను నెంబర్లు ఆరా తీయగా ఆచూకీ దొరికి ఇతని ఆట కట్టింది.''

★★★

ముసుగులో కొడుకుని చూసి కన్నతల్లి కన్నీళ్లు కట్టలు తెగాయి.

సాయంత్రం ఆఫీసు నుంచి వచ్చిన అన్నగారికి అతని భార్య ఈ తమ్ములుంగారి టీవీ దర్శనం గురించి చెప్పి కావల్సినంత దెప్పిపొడిచింది.

పెద్దపెద్ద పేరుప్రఖ్యాతుల్లో ఉన్న సంగీత బంధువులందరూ ఇంక వాణ్ని ఇంటికి రానివ్వకూడదని ఒకరికొకరు ఫోనుల్లో నిర్ణయించుకున్నారు.

ఈ వార్త చూశాక అతను వచ్చి వెళ్లాక కనిపించని వస్తువులకి కారణం అర్థమై ఆశ్చర్యపోయారు కొందరు పరిచితులు - పూర్వాశ్రమ శిష్యులు.

★★★

కేవమ్ కోలుకునేటప్పటికి చాలా సమయం పట్టింది. గోపాల్ సంగీత ప్రపంచాన్ని శాసించే కళాసామ్రాట్ కాగలడని కేవమ్ ఎన్నోసార్లు అనుకునేవాడు. అందుకు కావల్సిన పథకాలూ ప్రణా

గోపాల్ సంగీత ప్రపంచాన్ని శాసించే కళాసామ్రాట్ కాగలడని కేవమ్ ఎన్నోసార్లు అనుకునేవాడు. అందుకు కావల్సిన పథకాలూ ప్రణాళికలూ వేసుకునే వారు ఇద్దరూను. అమృతంలా ఉండే సంగీత భాండంలో చారెడు చెడ్డతనం చేరి పులిసిన కల్లుకుండ అయిపోయింది.

ళికలూ వేసుకునే వారు ఇద్దరూను. అమృతంలా ఉండే సంగీత భాండంలో చారెడు చెడ్డతనం చేరి పులిసిన కల్లుకుండ అయిపోయింది.

''అయినా గురూ ఇలాంటి దొంగ వెధవల ముఖాలు మనం చూస్తే వాడు మనకి కనిపించినప్పుడు జాగర్తపడతాం కదా! ముసుగులెందుకు వేస్తారు?'' అన్నాడు సంతోష్.

''అసలు దొంగని వదిలేసి ముసుగేసిన డమ్మీ దొంగల్ని చూపిస్తారేమో మన పోలీసోళ్లు'' మూర్తికి గొప్ప డౌట్ వచ్చింది.

''అసలీ ముసుగులు దొంగలు రడీగా పెట్టుకుంటారా? పోలీసోళ్లే టీవీవాళ్లు వచ్చేప్పుడు ఈ దొంగవెధవలకి అద్దెకిస్తారా?'' సంతోష్ సందేహం.

''వాణ్ని ఓ పాట పాడమనాల్సిందిరా'' అన్నాడు మూర్తి.

అందరూ నవ్వుకుంటూ జోకులేసుకుంటున్నారు.

కేఎమ్‌కి నవ్వూ రావట్లేదు. వాళ్ల మాటలూ వినబడట్లేదు.

వీడికి ఎడ్రస్సు లేదు. కేరాఫెడ్రస్సూ లేదు. అయినవాళ్లు ఇంట్లోంచి గెంటేసుంటారు. లేదా ఇవ్వాల్టి నుంచి ఇంట్లోకి రానియ్యరు.

బెయిలుండదు - ఎడ్వొకేట్లు ఉండరు - జైల్లో రామదాసు కీర్తనలు ప్రాక్టీసు చేసుకోవటమే.

★ ★ ★

నిజంగా కేఎమ్ అనుకున్నంతా అయింది.

టీవీలో వార్తలు చూశాక... కేసు పెట్టినవాళ్లందరూ ఫైళ్లు కెలకమని వాళ్ల వాళ్ల పరిధిల్లోని పోలీసు స్టేషన్‌కెళ్లి...ఫలానా చిలకలగూడ పోలీస్ స్టేషన్ అధీనంలో ఉన్నాడని రిమైండ్ చేశారు.


అన్ని బాణాలూ తలో వైపు నుంచి ఎక్కుపెట్టి ఉన్నప్పుడు గోపాల్‌కి తల తిరిగిపోయింది. తలకెక్కిన అభినందనల పొగరు దిగింది. తాగి తాగి నరాలకెక్కిన కిక్కు దిగింది.

గౌరవం సంపాదించుకోవటం ఎంత కష్టమో దాన్ని నిలబెట్టుకోవటం ఇంకెంత కష్టమో అనుభవానికి వచ్చింది.

అమ్మిన సొమ్ములూ, తాకట్టు పెట్టిన చోట్లూ...పోలీసులు అతనితో కక్కించారుట!

చాలా నెలల తర్వాత జైలు నుంచి వచ్చిన గోపాల్‌కి అమ్మ కూడా తలుపులు తెరవలేదు. అన్న ముఖం మీదే తలుపులు మూసేశాడు.

అలా అంబరం ఎత్తు ఆనందాలికి ఎగరేసిన తన పాటే తన స్థాయినిలా దిగజార్చింది అని అనుకున్నాడో...



ఆ గాన సరస్వతే శపించిందోగానీ... గోపాల్‌కి ఇంక ఆ పాట పలకట్లేదు.

స్వరాలు ఉసూరుమంటున్నాయి. జీవితం అంతా తీగతెగిన వైలెన్‌లా, శృతి లేని గీతంలా గ్రీష్మంలో కోయిలలా అగమ్యగోచరంగా అయిపోయింది.

ఎవర్నో మోసం చేద్దామనుకుని తనకే ద్రోహం చేసుకున్నాడు.

ఆ తర్వాతెప్పుడూ....గోపాల్ కనిపించలేదు ఎవ్వరికీ.

ఆ బెంగా లేదు. కనిపిస్తాడేమోనన్న భయం తప్ప.కేఎమ్..వాడు జ్ఞాపకంలోక్కూడా రాకూడదనుకున్నాడు. వద్దనుకున్నాగానీ మంచి పాట విన్నప్పుడు... అపస్వరంలా గుర్తుకొస్తుంటాడు. 'ఆ దీపాన్ని అలాగే గాలికి వదిలెయ్యకుండా చేతులడ్డుపెట్టి కాపాడి ఉంటే?' అనిపిస్తుంది- వెంటనే... 'తన చేతులూ కాలితే..' అనిపిస్తుంది.

ఎవరో అన్నమాట గుర్తొస్తుంది. ''కళని నువ్వెంత ఆరాధిస్తే..కళ నిన్నంత ఆదరిస్తుంది''

*